# సాక్షి
## వైఎస్ఆర్ జిల్లా

శనివారం । 6 । జనవరి । 2024






### హత్య కేసులో నిందితుల అరెస్ట్

బద్వేలు పట్టణంలో గురువారం జరిగిన అన్నదమ్ముల హత్య కేసులో ఆరుగురు నిందితులను అర్బన్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు.

-8లో



### జగన్మాతా.. పాహిమాం

జగన్మాత శ్రీఈశ్వరీదేవి ఆరాధన గురుపూజ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మహిళా భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర సమర్పించారు.

-8లో

గరిష్ఠం/కనిష్ఠం
30.7/21.5

### వాతావరణం

జిల్లాలో శుక్రవారం 21.5 - 30.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 9.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### వైవీయూలో పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో జర్నలిజం, లలితకళల విభాగంలో పీజీ డిప్లొమా కోర్సుల్లో ఈనెల 9,10, 11,12 తేదీల్లో నేరుగా ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకులు ఆచార్య కె. గంగయ్య తెలిపారు. జర్నలిజంశాఖ ఆధ్వర్యంలో పీజీ డిప్లొమా ఇన్ పబ్లిక్ రిలేషన్స్, పీజీ డిప్లొమా ఇన్ తెలుగు జర్నలిజం, ఫైన్ ఆర్ట్స్‌శాఖ ఆధ్వర్యంలో పీజీ డిప్లొమా ఇన్ థియేటర్ ఆర్ట్స్ కోర్సుల్లో ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసినవారు ఈ కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు అర్హులన్నారు. ఈ కోర్సులు పూర్తిగా సాయంత్రం నిర్వహించనున్న నేపథ్యంలో వైవీయూ పీజీ విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు కూడా చేయవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వైవీయూఈడీయూ.ఇన్ వెబ్ సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

### సౌత్ జోన్ పోటీలకు ఎంపిక



విద్యార్థి రాజేష్‌తో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, కోచ్

వేంపల్లె: సౌత్‌జోన్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఇడుపులపాయ ఆర్కే వ్యా ట్రిపుల్ ఐటీ విద్యార్థి సి.రాజేష్ ఎంపికైనట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. ఇటీవల వైజాగ్‌లో జరిగిన 53కేజీల సబ్ జూనియర్ విభాగంలో ఇతను రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటినట్లు చెప్పారు. జనవరి 19 నుంచి 21వ తేదీ వరకు తెనాలిలో జరిగే సౌత్ జోన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటాడన్నారు. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, పవర్ లిఫ్టింగ్ కోచ్ బాలగోవిందు తివారి, ఉపాధ్యాయులు విద్యార్థికి అభినందనలు తెలిపారు.

### జాతీయస్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ



ప్రశంసా పత్రాలతో విద్యార్థి దిలీప్ కుమార్

నందలూరు(రాజంపేట): మండలంలోని టంగుటూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న జి దిలీప్ కుమార్ జాతీయస్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ కనబరిచాడని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ పి గణేష్ బాబులు పేర్కొన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ దిలీప్ కుమార్ జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడన్నారు. రాష్ట్రస్థాయిలోనూ రాణించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. భువనేశ్వర్‌లో జరిగిన పోటీల్లో అండర్–14 విభాగంలో ఆడి రాణించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు విద్యార్థి దిలీప్ కుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ చాంద్ బాషా, ఉపాధ్యాయులు రమేష్ బాబు, మస్తానయ్య, లక్ష్మీనారాయణ రెడ్డి, రజియా బేగం, శశికళ, మోహన్ రాజు, పాఠశాల సిబ్బంది, నాగార్జున, బాదుల్లా, యాసిన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### సిద్దేశ్వరం ఉద్యమకారులకు బెయిలు



కోర్టు ఆవరణలో చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, భాస్కర్

కడప సెవెన్‌రోడ్స్: సిద్దేశ్వరం అలుగు నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమం నిర్వహించిన రాయలసీమ సాగునీటి సాధన సమితి జిల్లా కన్వీనర్ దేవగుడి చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, మల్లెల భాస్కర్‌లకు శుక్రవారం నంద్యాల జిల్లా ఆత్మకూరు కోర్టు బెయిలు మంజూరు చేసింది. రాయలసీమ ఇరిగేషన్ ప్రాజెక్టులకు సక్రమంగా సాగునీరు అందించేందుకు సిద్దేశ్వరం అలుగు నిర్మించాలని కోరుతూ 2016 మే, 30వ తేదీ రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో ఉద్యమం నిర్వహించారు. సుమారు 30 వేల మంది రైతులు ఆ రోజు అలుగు వద్దకు చేరుకున్నారు. నాటి చంద్రబాబు ప్రభుత్వం ఉద్యమాన్ని అణిచేందుకు నిషేధాజ్ఞలు విధించింది. అయినా రైతులు పోలీసు వలయాలను ఛేదించుకుని అలుగు వద్దకు చేరుకుని లాంఛనంగా నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో కొత్తపల్లె మండల పోలీసుస్టేషన్‌లో ఐపీసీ 147, 148, 149, 188, 353 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఉద్యమకారులంతా పరారీలో ఉన్నట్లు పోలీసులు పేర్కొనడంతో కోర్టు వారెంట్లు జారీ చేసింది. శుక్రవారం కోర్టుకు హాజరు కావడంతో బెయిలు మంజూరు చేశారు. తదుపరి విచారణ ఈనెల 11వ తేదీకి కోర్టు వాయిదా వేసింది.

# విద్యా వెలుగులు

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తూ చదువుల విప్లవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. అలాగే పాఠశాలలకు మౌలిక వసతులకు కల్పనకు కూడా పెద్దపీట వేశారు. కార్పొరేట్‌కు దీటుగా నాడు– నేడు ద్వారా పాఠశాలలను తీర్చిదిద్దారు. అమ్మ ఒడి, విద్యాకానుక, డిజిటల్ విద్య, గోరుముద్ద తదితర కార్యక్రమాల ద్వారా పేద విద్యార్థుల చదువులకు పెద్ద పీట వేస్తున్నారు. రాష్ట్రంలో విద్యా సంస్కరణలతో అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు పోటీ పడేలా చర్యలు తీసుకున్నారు. పేద పిల్లల బతుకుల్లో విద్యావెలుగులు నింపారు.

- ప్రభుత్వ పాఠశాలల్లో చదువుల పండుగ
- నాడు– నేడు ద్వారా కొత్త సొబగులు
- విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వం చర్యలు



నాడు నేడు ద్వారా అభివృద్ధి చెందిన తరగతి గదులు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న కార్యక్రమాలు విద్యార్థుల్లో నూతనోత్తేజాన్ని నింపుతున్నాయి. 2023 విద్యా సంవత్సరం పాఠశాలలు తెరిచిన రోజే జగనన్న విద్యాకానుక కింద విద్యా సామగ్రిని ప్రభుత్వం అందించింది. అలాగే పిల్లల తల్లులకు చదువులకు సాయంగా అమ్మ ఒడిని అందించి అండగా నిలించింది. నాడు– నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చింది. జగనన్న గోరుముద్ద ద్వారా రోజుకో మెనూతో మధ్యాహ్న భోజనం అందిస్తోంది. దీంతోపాటు సాంకేతికతకు పెద్దపీట వేస్తూ స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీ ప్యానల్ ద్వారా బోధనలు సాగేలా చర్యలు తీసుకుంది. అంతేకాకుండా 8వ తరగతి నుంచే ట్యాబ్‌ల ద్వారా డిజిటల్ తరగతులు నిర్వహిస్తూ అందరి మన్ననలను పొందుతోంది.

**విద్యాకానుక.. ప్రగతి వీచిక**

2023–24 విద్యా సంవత్సరంలో 2048 ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 1,58,156 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందించారు. ఇందులో బ్యాగ్, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం, బూట్లు, బెల్ట్, డిక్షనరీలు ఉన్నాయి. పిల్లల ఇచ్చే యూనిఫాం, బూట్లు కొలతల్లో తేడా లేకుండా అందించారు.

అమ్మ ఒడి: 180203 మందికి రూ.270.34 కోట్లు
నాడు- నేడు: 1005 స్కూళ్లకు 296.62 కోట్లు
ట్యాబ్‌లు: 17133
స్మార్ట్‌టీవీ, ఐఎఫ్‌పీలు మంజూరైన స్కూళ్లు : 1112

- అమ్మ ఒడితో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుల ఒరవడి సాగుతోంది. జిల్లావ్యాప్తంగా అమ్మ ఒడి కింద 180203 మంది విద్యార్థులకు 270.34 కోట్లు లబ్ధి పొందుతున్నారు.

**ట్యాబ్‌లతో సాంకేతిక పరిజ్ఞానం**

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను అందించారు. ఇందులో 17133 విద్యార్థులకు 2015 ఉపాధ్యాయులకు ఇచ్చారు. వీటిలో 64 జీబీ మెమరీ కార్డు వేసి సబ్జెక్టులవారీగా పాఠాలను అప్‌లోడ్ చేస్తున్నారు. అలాగే 2022–23 విద్యా సంవత్సరానికి మొదటి విడత కింద 430 పాఠశాలకు ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలు, 182 పాఠశాలకు 1109 ఐఎఫ్‌పీలు, 358 పాఠశాలకు 530 స్మార్ట్ టీవీలు మంజూరయ్యాయి. 2023–24 సంవత్సరానికి 690 పాఠశాలలకు ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలు మంజూరయ్యాయి. ఇందులో 202 పాఠశాలలకు 1064 ఐఎఫ్‌పీలు, 600 పాఠశాలలకు 734 స్మార్ట్‌టీవీలు మంజూరయ్యాయి.

**గోరుముద్దతో కమ్మని భోజనం**

విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం ద్వారా అమ్మ చేతి వంటలా ప్రతి రోజు ఒక మెనూతో నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు.

| నియోజకవర్గం | విద్యార్థులు | కిట్లకోసం చేసిన ఖర్చు (రూ.లక్షల్లో) |
|---|---|---|
| బద్వేల్ | 24068 | 601.70 |
| జమ్మలమడుగు | 22674 | 566.85 |
| కడప | 28657 | 716.43 |
| కమలాపురం | 20487 | 512.18 |
| మైదుకూరు | 20481 | 561.78 |
| పొద్దుటూరు | 17686 | 442.15 |
| పులివెందుల | 22113 | 552.83 |

జిల్లావ్యాప్తంగా 2024 పాఠశాలల్లో 1,36,444 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తింటున్నారు. ఇలా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వం అందరి మన్ననలను అందుకుంటోంది.

**కార్పొరేట్‌కు దీటుగా వసతులు**

జిల్లాలో రెండో విడత మనబడి నాడు – నేడు ద్వారా 1005 స్కూళ్లను ఎంపిక చేసి ఇందుకోసం రూ. 296.62 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లావ్యాప్తంగా 87 అంగన్‌వాడీ కేంద్రాలు, 637 ప్రాథమిక పాఠశాలలు, 75 ప్రాథమికోన్నత పాఠశాలలు, 197 హైస్కూల్స్, 9 జూనియర్ కళాశాలల్లో అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నారు. వీటిలో నాడు – నేడు కింద డ్రింకింగ్ వాటర్, విద్యుత్తు సౌకర్యం, ఫర్నీచర్, గ్రీన్‌చాక్‌బోర్డు, కిచెన్‌షెడ్డు, ఇంగ్లీస్ ల్యాబ్, పెయింట్స్, మేజర్ అండ్ మైనర్ రిపేర్స్ తదితర పనులు చేపడుతున్నారు.



ఐఎఫ్‌పీ ప్యానల్ ద్వారా బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

**బడుల రూపురేఖలు మారాయి**



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. నాడు నేడు ద్వారా అన్ని రకాల మౌలిక వసతులు కల్పించారు. అదనపు తరగతి గదులు, అత్యాధునిక మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పించారు.

– అంబవరం ప్రభాకర్‌రెడ్డి, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి

**విద్యారంగంలో కొత్త ఒరవడి**



వైస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత విద్యారంగంలో కొత్త ఒరవడి చోటు చేసుకుంది. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను కల్పించారు. పిల్లల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యతను కల్పించారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్య బాగా పెరిగింది.

– ఎద్దుల రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

### అధిక వడ్డీ ఆశ చూపి రూ.3 కోట్లకు కుచ్చుటోపీ



కడప డీఎస్పీ కార్యాలయం వద్ద బాధితులు

కడప అర్బన్: అధికవడ్డీ ఆశ చూపి గోల్డ్ లోన్లు పెట్టించి కస్టమర్ల నుంచి దాదాపు రూ.3 కోట్ల మేర స్వాహా చేసిన ఓ మహిళా ఉద్యోగి బాగోతం కడపలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడప నగరంలోని అక్కాయపల్లికు చెందిన సౌజన్య (33) అప్సరా సర్కిల్ సమీపంలోని ఓ ఫైనాన్స్ కార్యాలయంలో క్యాషియర్‌గా పనిచేస్తోంది. తమ వద్దకు వచ్చే కస్టమర్లను మాటలతో ఆకర్షించేది. తమకు గోల్డ్ లోన్‌లు చేయించాలనే టార్గెట్ వుందంటూ ఎవరైనా తమ దగ్గరున్న బంగారు ఆభరణాలను తమ సంస్థలో తాకట్టు పెట్టి డబ్బులను తీసుకోవాలని ప్రోత్సహించింది. పైగా లోన్ మొత్తంలో అధికశాతం తనకు ఇస్తే భారీ వడ్డీ చెల్లిస్తానని, అనంతరం వారం నుంచి నెల లోపు నగలు విడిపిస్తామని నమ్మబలికింది. ఈ క్రమంలో చాలామంది ఆమె మాటలు నమ్మి, వడ్డీకి ఆశపడి ఇళ్లలో దాచుకున్న బంగారు ఆభరణాలను తీసుకుని వచ్చి రుణాలను పొందేవారు. వచ్చిన లోన్ మొత్తంలో కొంత వారు తీసుకుని ఎక్కువ శాతం మహిళా ఉద్యోగికి ఇచ్చేవారు. అయితే ఎన్నాళ్లు గడిచినా సౌజన్య నగలు విడిపించకపోవడంతో కొందరు కస్టమర్లకు అనుమానం వచ్చింది. ఆమెను నిలదీసేందుకు బాధితులు ప్రయత్నిస్తే, తన భార్య కనిపించడం లేదని సౌజన్య భర్త నిత్యానందరావు గత నెల 16న చిన్నచౌక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలోనే తమకు న్యాయం చేయాలని బాధితులు జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్‌ను శుక్రవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ ఎం.డి.షరీఫ్ ఈ సంఘటనపై సమగ్రంగా దర్యాప్తు చేపట్టి న్యాయం చేస్తామని విలేకరులకు తెలిపారు.

### చర్చి నిర్మాణానికి రూ.25లక్షలు మంజూరు



నిధుల మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తదితరులు

**ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి**

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు మండలంలోని రామాపురం గ్రామంలో నిర్మిస్తున్న సీఎస్ఐ చర్చి నిర్మాణానికి ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సీఎస్ఆర్ ఫండ్ ద్వారా రూ.25లక్షలు నిధులు మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన పత్రాన్ని శుక్రవారం గ్రామంలోని చర్చి పెద్దలకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పాలనలో అన్ని సామాజిక వర్గాల వారికి సమన్యాయం జరుగుతోందన్నారు. గతంలో తనతో పాటు రామాపురం గ్రామానికి చెందిన చర్చి పెద్దలు నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. ఇందుకు స్పందించిన ఎంపీ రూ.25లక్షలు మంజూరు చేయడంతోపాటు ఆ పత్రాలను స్వయంగా గ్రామానికి వచ్చి అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఎంపీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ జేష్టాది శారద, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీపీ శేఖర్ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్లు పాతకోట బంగారు మునిరెడ్డి, ఆయిల్ మిల్లు ఖాజా, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డి, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగేశ్వారెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల అధ్యక్షులు మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రశాంతం

కడప కోటిరెడ్డిసర్కిల్: వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 పరిధిలో పరిధిలో శుక్రవారం స్థానిక ఆ శాఖ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ నుంచి సీనియర్ అసిస్టెంట్ గా నిర్వహించిన పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. 40 మందికి 32 మంది హాజరయ్యారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించామని ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం సూపరిండెంట్ వెంకటసుబ్బమ్మ గోపాల్ రెడ్డి సీనియర్ అసిస్టెంట్స్ వనిషా బతనయ్య తదితరులు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

### సృజనాత్మకతను వెలికి తీయడమే లక్ష్యం




సమావేశంలో మాట్లాడుతున్న సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, సామర్థ్యాలను వెలికి తీసేందేందుకు బాలోత్సవ్ కార్యక్రమం ఉపయోగపడుతుందని డీఈఓ రాఘవరెడ్డి, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడపలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్లో కడప బాలోత్సవం కమిటీ అధ్యక్షుడు, పరిశ్రమలశాఖ పదవీ విరమణ డిప్యూటీ డైరెక్టర్ గోపాల్, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఓబుల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాహులు, కార్యదర్శి లక్ష్మిరాజాలు ఆధ్వర్యంలో తొలి రోజు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ రాఘవరెడ్డి మాట్లాడుతూ సమాజంలో బాలబాలికల హక్కులు కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు నైతిక విలువలను పెంచుకోవాలన్నారు. సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సంస్కారం, లోకజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. నేటి విద్యార్థులు భావిభారత పౌరులుగా ఎదిగి సమాజ నిర్దేశకులుగా తయారు కావాలన్నారు. ఐసీడీఎస్ ఆర్‌జేడీ రోహిణి మాట్లాడుతూ బాలబాలికలు చదువులపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ఇష్టపడి చదవాలని సూచించారు. బాలోత్సవ కమిటీ అధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యాలను వెలికి తీయడానికి బాలోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యదర్శి లక్ష్మిరాజా మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ పెంచే దిశగా ఈ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. ఉపాధ్యక్షుడు డాక్టర్ ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో విద్యార్థుల గొప్పస్థానానికి చేరుకోవడానికి మార్కులే ప్రామాణికం కాదన్నారు. కష్టపడే తత్వాన్ని అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బాలఎల్లారెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ నాగమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్
- జిల్లాలో 3621 మందికి రూ. 5.34 కోట్లు

కడప సెవెన్‌రోడ్స్: అర్హత ఉన్నా వివిధ కారణాలతో ఇప్పటిదాకా సంక్షేమ పథకాలను పొందలేకపోయిన వారికి వాటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో 3621 మంది అర్హులను గుర్తించి వివిధ సంక్షేమ పథకాల కింద వారికి రూ. 5.34 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానం ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశారు. ముఖ్యమంత్రి వీసీ అనంతరం రూ.5,34,89,971 లకు సంబంధించిన మెగా చెక్కును జేసీ గణేష్ కుమార్ అధికారులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు జిల్లాలో సంతృప్త స్థాయిలో అమలవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో సుధాకర్ రెడ్డి, డీఆర్డీఏ, ఆనంద్ నాయక్, సంబంధిత సంక్షేమ శాఖల అధికారులు, లబ్ధిదారులు తదితరులు హాజరయ్యారు.




లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న జేసీ గణేష్‌కుమార్ తదితరులు

**జగనన్న పాలన స్వర్ణయుగం**



జగనన్న చేదోడు సాయం అందుకున్నాను. ఆరోగ్యశ్రీ ద్వారా ఎన్నో కుటుంబాల్లో సంతోషాలు నింపారు. పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారు. జగనన్న పాలన స్వర్ణయుగంగా చెప్పవచ్చు.

– చిన్న వెంకటరమణ, కడప

**అన్ని వర్గాల వారికి సాయం అందుతోంది**



ప్రభుత్వం అమలు చేస్తున్న 'జగనన్న అమ్మఒడి', వైఎస్ఆర్ పెన్షన్ కానుక పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నాను. ప్రస్తుతం జగనన్న అమ్మఒడి పథకం లబ్ధి మొత్తాన్ని.. ముఖ్యమంత్రి ఈ రోజు జమ చేశారు.. కొన్ని కారణాల వల్ల మొదట్లో లబ్ధి పొందలేకపోయిన వారికి మళ్లీ అవకాశం ఇచ్చిన ప్రభుత్వానికి ధన్యవాదాలు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలనలో ఇచ్చిన హామీలకంటే అదనంగా అన్ని వర్గాల వారికి సాయం అందుతోంది.

– అనసూయ, నబీకోట, కడప

**మహిళల ఆత్మగౌరవం పెరిగింది**



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి మహిళల ఆత్మగౌరవం పెరిగింది. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు అవసరమైన సేవలను ప్రభుత్వం అందిస్తోంది. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే.. ఇలాంటి ముఖ్యమంత్రి పది కాలాలు ఉండాలి. ఈ ప్రభుత్వంలో అమ్మఒడి, ఆసరా, చేదోడు లబ్ధితో పాటు.. ఇంటి స్థలం కూడా పొందాను. పెండింగ్ లబ్ధి అందుకోవడం సంతోషంగా ఉంది.

– జి. సురేఖ, మారుతీ నగర్, కడప

**పారదర్శకత అంటే ఏమిటో తెలుస్తోంది**



జగనన్న ప్రభుత్వం వచ్చాక పారదర్శకత అంటే ఏమిటో తెలుస్తోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న అమ్మఒడి, వైఎస్ఆర్ ఆసరా, జగనన్న చేదోడు పథకాల లబ్ధి అందుకోవడం సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రానికి ఏ కొరత ఉండదు. ఈ ప్రభుత్వ హయాంలో రైతులు కూడా దళారీ వ్యవస్థ నుంచి నష్టపోకుండా బయట పడగలిగారు.

– ఎస్. అయేషా, ఎర్రముక్కపల్లె, కడప

### నేడు రాయచోటిలో 100 పడకల ఆసుపత్రి ప్రారంభం



ప్రారంభానికి సిద్ధమైన ఆసుపత్రి

రాయచోటి టౌన్: రాయచోటి పట్టణంలోని ఏరియా ఆస్పత్రి 50 పడకల నుంచి 100 పడకల ఆసుపత్రిగా రూపు దిద్దుకొని అన్ని హంగులతో ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. దీనిని రూ.24.5కోట్లతో నిర్మించారు. శనివారం ఎంపీ మిథున్ రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్ పర్సన్ జకియాఖానం, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ గిరీషా కార్యక్రమానికి హాజరై ఆసుపత్రిని ప్రారంభిస్తారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డేవిడ్ సుకుమార్ తెలిపారు. ఈ ఆసుపత్రిలో అన్ని రకాల జబ్బులకు చికిత్స లభించే విధంగా సదుపాయాలు కల్పించారు. మూడు అత్యాధునిక ఆపరేషన్ల థియేటర్లు, 10 ఐసీయూ బెడ్లు, అనస్తీషియా వర్క్‌స్టేషన్లు, ఓపీ గదులు ఏర్పాటు చేశారు. ఈఎన్‌టీ విభాగాలు కూడా అందుబాటులోకి వచ్చాయి. 26 మంది వైద్యాధికారులు, 73 మంది వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటారు. రాయచోటి డివిజన్ పరిధితో పాటు జిల్లాలోని కలకడ, పీలేరు, గుర్రంకొండ, గాలివీడు, వైఎస్సార్ జిల్లా చక్రాయపేట మండలాలకు చెందిన ప్రజలకు చికిత్స అందనుంది.

## క్లుప్తంగా

### బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని కాగితాలపెంటలో ఓ మైనర్ బాలికకు వివాహం చేస్తున్నారన్న సమాచారాన్ని అందుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, డబ్ల్యూఎంఎస్‌కే అనిషా ఆ ప్రాంతానికి వెళ్లి అడ్డుకున్నారు. శనివారం వివాహం చేయబోతున్నారన్న పక్కా సమాచారంతో పోలీసులతో వివాహ వేదిక వద్దకు వెళ్లి పెద్దలకు నచ్చజెప్పారు. అనంతరం తహసీల్దార్ శివరామిరెడ్డి ఎదుట హాజరుపరిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. యువతికి 18, యువకుడికి 21 ఏళ్లు వచ్చే వరకు వివాహం చేయరాదని సూచించారు. పిల్లలను బాగా చదివించాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కేపీ రొనాల్డ్ తదితరులు పాల్గొన్నారు.

### భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు చేయాలి



వైఎస్సార్ సమాధి వద్ద వినతి పత్రం సమర్పిస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలని జిల్లా బార్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌ను సందర్శించి వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ జమ్మలమడుగు, మైదుకూరు, కమలాపురం, ప్రొద్దుటూరులలోని న్యాయవాదులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు అబిద్ హుస్సేన్, నారాయణరెడ్డి, మురళీధర్‌రెడ్డి, నారాయణరెడ్డి, న్యాయవాదులు శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి, రమేష్, మాధవయ్య, వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ మద్యం పట్టివేత



బాటిళ్లు చూపుతున్న సీఐ, పోలీసులు

వేంపల్లె : వేంపల్లె పట్టణంలో అక్రమ మద్యం పట్టుకున్నట్లు సీఐ చాంద్‌బాషా తెలిపారు. స్థానికంగా అక్రమ మద్యం సరఫరా చేస్తున్న కేశవులును శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 20 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. దాడుల్లో పోలీసు సిబ్బంది కిరణ్, మహమ్మద్ అలీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

**ఒకరి అరెస్ట్**

సింహాద్రిపురం : మండల పరిధిలోని వై.కొత్తపల్లె గ్రామం పులివెందుల – తాడిపత్రి మెయిన్ రోడ్డు పక్కన ఉన్న చిల్లర అంగడిలో అక్రమంగా మద్యం అమ్ముతున్న రామనాథ్‌రెడ్డిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రోషన్ తెలిపారు. అతని వద్ద నుంచి 6 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

# జగన్మాతా.. పాహిమాం

- వైభవంగా ఈశ్వరీదేవి ఆరాధనోత్సవాలు
- పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తజనం





అమ్మవారికి కుంకుమార్చన నిర్వహిస్తున్న మఠాధిపతి దంపతులు, పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం : 'దేవీ శరణం.. మాతా శరణం.. జగన్మాతా పాహిమాం.. జగజ్జననీ రక్షమాం' అనే నినాదాలతో బ్రహ్మంగారిమఠం మార్మోగింది. కందిమల్లాయపల్లె భక్తజన సంద్రంగా మారింది. జగన్మాత శ్రీఈశ్వరీదేవి ఆరాధన గురుపూజ మహోత్సవాలు మూడు రోజుల నుంచి ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారు సజీవ సమాధి నిష్ఠ వహించిన రోజైన శుక్రవారం కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీఈశ్వరీ మాత సేవా సమితి ట్రస్ట్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన మహిళా భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర సమర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అంగలకుదుటి సుశీల, ప్రధాన కార్యదర్శి సుజాత, ఉపాధ్యక్షురాలు రమాదేవి, కృష్ణవేణి, వజ్రాల ఇందిర తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన చేశారు. మఠాధిపతి శ్రీవీరశివకుమారస్వామి, రాజేశ్వరిదేవి దంపతులు, మహిళా భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి మాలధారులు ఇరుముడి సమర్పించారు.

**పట్టు వస్త్రాలు సమర్పించిన ప్రముఖులు**

శ్రీఈశ్వరీదేవికి మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. వారి వెంట మైదుకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, మఠం ఎంపీపీ వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి దువ్వూరి నరసింహాచారి, న్యాయ సలహా కమిటీ చైర్మన్ గురుప్రసాద్, రాజకీయ వ్యవహాల కమిటీ చైర్మన్ గురువాచారి తదితరులు ఉన్నారు. అలాగే రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాలురెడ్డి, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త పుట్టా సుధాకర్ యాదవ్, జమ్మలమడుగు నాయకుడు భూపేష్‌రెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకుముందు వారు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకున్నారు. కక్కయ్యస్వామిని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

**కమనీయంగా దీక్షా బంధన అలంకరణ**

మధ్యాహ్నం లోకపావని దీక్షా బంధన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అల్పాహారం, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రాత్రి పండ్లతో తులాభారం నిర్వహించి, వాటిని భక్తులకు పంపిణీ చేశారు. సింహవాహనోత్సవం ఉత్సాహ భరితంగా జరిగింది. సహస్ర దీపాలంకరణ వెలుగుతో దేవస్థానం కాంతులీనింది. నరసన్నపల్లికి చెందిన శ్రీ అభయ సీతారామ భజన మండలి ఆధ్వర్యంలో చేపట్టిన చెక్కభజన అలరించింది. గుంటూరుకు చెందిన భాగవతారిణి తిరువళ్లూరి దివ్యశివ ప్రదర్శించిన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటకం భక్తులను తన్మయులను చేసింది. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయ ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో మఠం సిబ్బంది, అమ్మవారి శిష్యులు ఏర్పాట్లు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది.

**బ్రహ్మంగారి తత్వం.. మార్గనిర్దేశం**

శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి తత్వం సమాజానికి మార్గనిర్దేశమని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ తెలిపారు. బ్రహ్మంగారిమఠంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి.. సామాజిక తత్వవేత్త, జగన్మాత శ్రీ ఈశ్వరీదేవి ఆరాధన గురుపూజ మహోత్సవాలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి ఎన్నో ఏళ్ల నుంచి పాతుకుపోయిన కులతత్వాన్ని నిరసించారన్నారు. తన శిష్యులుగా మహమ్మదీయుడైన సిద్దయ్యస్వామి, దళిత సామాజిక వర్గానికి చెందిన కక్కయ్యస్వామి, బ్రాహ్మణుడైన అన్నాజయ్య, రెడ్డి కులస్తులైన అచ్చమాంబ, బ్రహ్మానందరెడ్డిలను అక్కున చేర్చుకున్నారని చెప్పారు. తాను కక్కయ్యస్వామి వారసునిగా ఇక్కడికి వచ్చానని తెలిపారు. బ్రహ్మంగారి తత్వాలను రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి ప్రచారం చేస్తామన్నారు. ఇందులో భాగంగా స్వామి సన్నిధానం నుంచే శ్రీకారం చుట్టామని చెప్పారు. కార్యక్రమంలో తోట్లపల్లె అచలానంద ఆశ్రమం పీఠాధిపతి శ్రీ విరజానందస్వామి, శ్రీ ఈశ్వరీదేవిమఠం మఠాధిపతి శ్రీ వీరశివకుమారస్వామి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు, బీసీ కులాల ఐక్య వేదిక జనరల్ సెక్రటరీ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అనాథ వృద్ధురాలికి అంత్యక్రియలు



వృద్ధురాలి అంత్యక్రియల్లో సేవాశ్రమ ప్రతినిధులు

పోరుమామిళ్ల : పోరుమామిళ్లలో అనాథ వృద్ధురాలికి వివేకానంద సేవాశ్రమం ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. ధనలక్ష్మి అనే వృద్ధురాలిని పోరుమామిళ్ల సమీపంలో ఆదివారం తన వారే వదిలేసి వెళ్లిపోయారు. ఒళ్లంతా పుండ్లతో, నడవలేని స్థితిలో బస్టాఫ్ వద్ద పడి వున్న ఆమెను వివేకానంద సేవాశ్రమం వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డి, రామతులసి దంపతులు అక్కున చేర్చుకుని, ఆశ్రమానికి తెచ్చారు. నీళ్లు తప్ప ఏమీ తీసుకోకపోవడంతో బాగా నీరసించి, అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. సమాచారం ఆమె బంధువులకు తెలిపేందుకు ఆర్డీఓ ఆకుల వెంకటరమణ ద్వారా ప్రయత్నిస్తే ఎలాంటి వివరాలు తెలియలేదని, తామే ఆమె అంత్యక్రియలు నిర్వహించినట్లు రామకృష్ణారెడ్డి తెలిపారు. సేవాశ్రమ సభ్యులు రోశిరెడ్డి, వెంకటేశ్వర్లు, మనోజ్‌కుమార్, శ్రీనివాసులరెడ్డి సంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు.

## అన్నదమ్ముల హత్య కేసులో నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్

బద్వేలు అర్బన్ : బద్వేలు పట్టణంలో గురువారం జరిగిన అన్నదమ్ముల హత్య కేసులో ఆరుగురు నిందితులను అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం స్థానిక అర్బన్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మైదుకూరు డీఎస్పీ ఎస్.ఆర్.వంశీధర్‌గౌడ్ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన పసుపులేటి ప్రశాంత్, పసుపులేటి సాయికుమార్ అలియాస్ వార్త అనే ఇద్దరు యువకులకు సుమిత్రానగర్‌కు చెందిన లకిడి వెంకటప్రమోద్‌కుమార్‌కు మధ్య గురువారం ఉదయం మార్కెట్‌యార్డు సమీపంలో ఘర్షణ జరిగింది. ఈ సమయంలో చంపుతామని ఒకరినొకరు బెదిరించుకున్నారు. తర్వాత ప్రమోద్‌కుమార్ జరిగిన విషయాన్ని తండ్రి లకిడి విజయభాస్కర్, తమ్ముడు లకిడి వెంకటతరుణ్‌తేజ్‌కు చెప్పాడు. దీంతో ముగ్గురితోపాటు తరుణ్‌తేజ్ స్నేహితులైన వీరంరెడ్డి భరత్‌కుమార్‌రెడ్డి, గణేష్, ఉదయ్‌కిరణ్‌లు కలిసి ప్రశాంత్, సాయికుమార్‌లతో ఘర్షణ పడేందుకు సిద్ధమయ్యారు. స్థానిక సిద్ధవటం రోడ్డులోని ఫైర్‌స్టేషన్ సమీపంలో ఉన్న టీ దుకాణం వద్ద ప్రశాంత్, సాయికుమార్ ఉన్నట్లు తెలుసుకుని అక్కడికి వెళ్లి వారిపై.. నిందితులు విచక్షణా రహితంగా కత్తులు, బండరాళ్లతో దాడి చేశారు. సాయికుమార్‌పై లకిడి విజయభాస్కర్, తరుణ్‌తేజ్‌లు, ప్రశాంత్‌పైన ప్రమోద్‌కుమార్ కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలో ప్రశాంత్ అక్కడికక్కడే మృతి చెందగా సాయికుమార్‌ను ఆసుపత్రిలో చేర్పించిన కొద్దిసేపటికే మరణించాడు. మృతుల తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శుక్రవారం నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి హత్యలకు ఉపయోగించిన కత్తి, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో అర్బన్ సీఐ యుగంధర్, ఏఎస్ఐ చంద్రనాయక్, హెడ్ కానిస్టేబుల్ గంగన్న, కానిస్టేబుళ్లు సుధాకర్, ప్రతాప్‌రెడ్డి, హోంగార్డు రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## అర్హత ఉన్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు



మాట్లాడుతున్న జేసీ గణేష్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో అర్హులైన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జేసీ అధ్యక్షతన ప్రభుత్వం జర్నలిస్టులకు అందజేస్తున్న హౌస్ సైట్స్‌కు సంబంధించి జిల్లా మీడియా జర్నలిస్ట్ హౌసింగ్ కమిటీ మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ నంబరు 535లో ఉన్న అన్ని నిబంధనలను పాటించి, అర్హత ఉన్న జర్నలిస్టులకు హౌసింగ్ సైట్స్ ఇవ్వడానికి కమిటీ అంగీకారం తెలిపిందన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లాలో అర్హత ఉన్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలలో పని చేస్తున్న జర్నలిస్టులకు, పీరియాడికల్, ఫ్రీలాన్సర్స్, వెటరన్ పాత్రికేయులకు జీవోలో పొందుపరిచిన అర్హతలు, నిబంధనల ప్రకారం దరఖాస్తులు పూర్తి చేసిన వారికి హౌస్ సైట్స్ కేటాయిస్తామన్నారు. ఐదేళ్ల అక్రిడేషన్ అనుభవం కల్గిన వారిని కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ, విజయవాడ వారు గుర్తించి పంపిన ప్రాథమిక జాబితాను పరిశీలించిన అనంతరం తుది జాబితా మేరకు ఇంటి స్థలాలివ్వడం జరుగుతుందన్నారు. హౌస్ సైట్స్ సంబంధించి శనివారం చివరి తేదీగా నిర్ణయించినందున జిల్లాలో అర్హత ఉండి ఇంకా దరఖాస్తు చేసుకోని పాత్రికేయులు నిర్దేశించిన వెబ్ సైట్‌లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం అవసరమైన డాక్యుమెంట్లను అప్లోడ్ చేసి, సదరు కాపీలను జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఆయా నియోజక వర్గాల్లో సరైన స్థలం గుర్తించాలని ఆర్డీఓలను ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా స్థాయి మీడియా జర్నలిస్ట్ హౌసింగ్ కమిటీ సభ్యులైన కడప, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల ఆర్డీవోలు మధుసూదన్, శ్రీనివాసులు, వెంకట రమణ, వెంకటేశ్వర్లు, కన్వీనరు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి వేణుగోపాల్‌రెడ్డి, సాక్షి బ్యూరో ఇన్‌చార్జి ఎం.బాలకృష్ణారెడ్డి, 10 టీవీ రిపోర్టర్ కార్తీక్, డివిజినల్ పీఆర్వో సునీల్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో సీఎం సతీమణి వైఎస్ భారతి



పులివెందులలో వివాహ వేడుకల్లో పాల్గొన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతి

పులివెందుల : పులివెందులలో దివంగత డాక్టర్ ఈసీ గంగిరెడ్డి మేనకోడలు తులసమ్మ, ఎద్దుల కృష్ణకుమార్ రెడ్డిల కుమారుడు డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మీ ప్రియల వివాహం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతి, ఈసీ గంగిరెడ్డి సతీమణి డాక్టర్ సుగుణమ్మ, కుమారుడు ఈసీ దినేష్‌రెడ్డి పాల్గొన్నారు. వారు నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## నవశకం

### సొంతింటి కల నెరవేరింది



మేము వ్యవసాయ కూలి పనులకు వెళ్తూ జీవనం కొనసాగిస్తున్నాం. ఇల్లు కట్టుకునేందుకు కనీసం స్థలం కొనలేని పరిస్థితి. తెలిసిన వారి ఇంట్లో ఉన్నాం. గత ప్రభుత్వంలో చాలా సార్లు ఇంటి స్థలం కోసం అర్జీలు పెట్టుకున్నా మంజూరు కాలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన వచ్చిన తరువాత ఆఫీసుల చుట్టూ తిరగ కుండానే మాకు స్థలంతోపాటు ఇల్లు మంజూరైంది. ఇప్పుడు జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకుంటున్నాను. జగన్ పుణ్యమా అని మాకు సొంత ఇంటి కల నెరవేరింది.

– తమటం లక్ష్మీదేవి, పాలకొండ్రాయునిపల్లి, బొగిడివారిపల్లె పంచాయతీ, సిద్దవటం మండలం

### పాఠశాలల రూపురేఖలు మారాయి



నాడు–నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. కార్పొరేట్ స్థాయి వసతులకు ఏమాత్రం తగ్గకుండా ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పన ద్వారా సీఎం వైఎస్ జగన్ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేయడం, ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు నిపుణులను నియమించడం ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి పెరుగుతోంది. మూడు దశలలో రూ.18 వేల కోట్లతో పాఠశాలలకు మౌలిక వసతుల కల్పనతో పాటు అభ్యసన ఫలితాలను మెరుగుపర్చడం, డ్రాపౌట్స్‌ను తగ్గించడమే ధ్యేయంగా సీఎం శ్రమిస్తున్నారు. – మున్వర్‌బాషా, ప్రధానోపాధ్యాయుడు, రాయచోటి

### ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ధ్రువ పత్రాలు



ఒక్క రూపాయి ఖర్చు లేకుండానే రెండు రోజుల్లోనే ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి. గతంలో ధ్రువీకరణ పత్రాలు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకునేవాళ్లం. అయినా సకాలంలో వచ్చేవి కావు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా స్థానిక సచివాలయంలోనే అవసరమైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని వలంటీర్ చెప్పడంతో నేను దరఖాస్తు చేసుకున్నాను. రెండు రోజుల వ్యవధిలోనే వచ్చాయి. సర్టిఫికెట్ల కోసం ఆఫీసుల చుట్టూ తిరగకుండా జగనన్న సురక్ష కార్యాక్రమాన్ని ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం. – బెల్లం మల్లేశ్వరి, కాలువపల్లె, గోపవరం మండలం

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన షేక్షావలి

కొండాపురం : మండల పరిధిలోని యర్రగుడి గ్రామానికి చెందిన యువకుడు గుడిపాటి షేక్షావలి(35) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శుక్రవారం తెలిపారు. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. షేక్షావలి వలంటీర్‌గా పని చేస్తూ ఆటో తోలుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అదే గ్రామానికి చెందిన ఎం.సుబ్బరాయుడు మైలవరం మండలంలోని బుచ్చంపల్లె గ్రామంలో బియ్యం ప్యాకెట్లు కొనుగోలు చేశాడు. అక్కడ నుంచి బియ్యం ప్యాకెట్లు తీసుకురావడానికి స్వగ్రామం నుంచి గుడిపాటి షేక్షావలి ఆటో బాడుగకు తీసుకొని ఇద్దరు బయలుదేరారు. మార్గం మధ్యలోని దొబ్బుడుపల్లె, నక్కోనిపల్లె గ్రామాల మధ్యలో గుంతను తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ఈ సంఘటనలో షేక్షావలి మృతి చెందగా, సుబ్బరాయుడుకు గాయాలయ్యాయి. సుబ్బరాయుడు ప్రొద్దుటూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## రేషన్ బియ్యం పట్టివేత

చెన్నూరు : చెన్నూరు వనం వీధిలోని ఒక ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. చెన్నూరుకు చెందిన కాటం బ్రహ్మయ్య చెన్నూరు, చుట్టుపక్కల గ్రామాల ప్రజల వద్ద నుంచి ప్రభుత్వ చౌక బియ్యాన్ని సేకరించి అక్రమంగా నిల్వ ఉంచాడు. కర్ణాటక రాష్ట్రంలోని బంగారుపేటకు తరలించేందుకు సిద్ధంగా ఉన్నారనే సమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. కడప రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసుం బాషా ఆదేశాల మేరకు కడప విజిలెన్స్ అధికారులు టి.రెడ్డప్ప, ఈ.బాల గంగాధర్‌రెడ్డి, మురళీకృష్ణ దాడుల్లో పాల్గొన్నారు. 113 బస్తాలు (5270 కేజీలు) రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ. 2,13,435లుగా ఉన్నట్లు వారు తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం బియ్యంను చెన్నూరు ఎంఆర్ఐకి అప్పగించారు. కాటం బ్రహ్మయ్యపై చెన్నూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



పెండ్లిమర్రి : వైద్య శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడుతున్న శ్రీనివాస్

చక్రాయపేట : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరం అని ఆరోగ్య సురక్ష రాష్ట్ర పరిశీలకుడు శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని నెరుసుపల్లె గ్రామ సచివాలయం వద్ద ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి మాట్లాడుతూ ఇక్కడ పరీక్షలు నిర్వహించి ఏవైనా జబ్బులు ఉన్నట్లు తెలిస్తే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నట్లు చెప్పారు. పెద్ద జబ్బులు ఉంటే ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవీ బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మోహన్‌రెడ్డి, డీపీఎం భాస్కర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో ఖాజామైనుద్దీన్, వైద్యాధికారి శివప్రసాద్, ఎంపీడీవో శివారెడ్డి, కంటి వైద్యుడు రెడ్డెన్న పాల్గొన్నారు.

**పరిశీలన**

పెండ్లిమర్రి : మండలంలోని జీసీపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆరోగ్య సురక్ష రాష్ట్ర పరిశీలకుడు శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీపీఎం భాస్కర్, ఎంపీవీ ప్రసాద్, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, వైద్యుడు వినయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## మోటార్ సైకిళ్ల దొంగల అరెస్ట్



మోటార్లు సైకిళ్లు, నిందితులతో పోలీస్ అధికారులు, సిబ్బంది

కడప అర్బన్ : మోటార్ సైకిళ్ల చోరీ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో ఇటీవల కాలంలో 17 మోటార్ సైకిళ్లను దొంగతనం చేసిన నిందితుల ఆచూకీ కోసం ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ పర్యవేక్షణలో కడప ఒన్‌టౌన్ సీఐ సి.భాస్కర్‌రెడ్డి, ఎస్ఐ రంగస్వామి, సీసీఎస్ సీఐ నారాయణ యాదవ్, సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో కడప నగరంలోని రిమ్స్ రహదారిలో శివానందపురం క్రాస్ రోడ్డు వద్ద ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వారిని విచారణ చేసి 14 మోటార్ సైకిళ్లను రికవరీ చేశారు. ఈ వివరాలను శుక్రవారం సాయంత్రం కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ సి.భాస్కర్‌రెడ్డి వెల్లడించారు. కడప నగర శివార్లలోని చింతకొమ్మదిన్నె మండలం ఇందిరానగర్‌లో నివాసం వుంటున్న చిన్నాయపల్లి జనార్దన, కడప నగరం రాజారెడ్డి వీధికి చెందిన మొగలిరేకుల నరసింహాచారి గత కొన్ని నెలలుగా వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాలలో మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడేవారన్నారు. వీరి వద్ద నుంచి రూ.7.5 లక్షల విలువైన 14 మోటార్ సైకిళ్లను రికవరీ చేశామన్నారు. మరో మూడు మోటార్ సైకిళ్లను రికవరీ చేస్తామన్నారు. నిందితులలో మరొకరు పరారీలో వున్నారన్నారు. వీరిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన కడప ఒన్‌టౌన్ సీఐ సి.భాస్కర్‌రెడ్డి, ఎస్ఐ రంగస్వామి, కడప సీసీఎస్ ఏఎస్ఐ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుళ్లు పీరు సాహెబ్, భాస్కర్, కె. వెంకటరాజు, కానిస్టేబుళ్లు బాషా, ఖాదర్‌హుసేన్, చంద్రనారాయణరెడ్డి, మహేష్, సిబ్బందిని కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ అభినందించారు.